సాక్షి ఖమ్మం

బుధవారం ౹ 12 ౹ ఏప్రిల్ ౹ 2023



జేపీఎస్‌ల్లో చిగురిస్తున్న ఆశలు

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ గడువు ముగియడంతో రెగ్యులరైజేషన్‌పై ఆశలు చిగురిస్తున్నాయి. 10లో



ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

జేఈఈ మెయిన్స్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని మూడు కేంద్రాల్లో రెండు సెషన్లుగా పరీక్ష నిర్వహించారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
42° / 23°

జిల్లాలో బుధవారం ఎండ ప్రభావం ఉదయం నుంచే మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఎండ తీవ్రమతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సా॥) 6.29
సహర్ (గురువారం ఉ॥) 4.31

న్యూస్‌రీల్

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోండి



కంటిపరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

బోనకల్: కంటివెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ మాలతి సూచించారు. మండలంలోని రావినూతలలో శిబిరాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ఉచితంగా కంటి పరీక్షలు చేయడమే కాక అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ శ్వేత, ఆర్‌ఐ లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సహాయ ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంగాంధీచౌక్: అర్హులైన దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి సీహెచ్.సంధ్యారాణి సూచించారు. బధిరులు, అంధులు, మానసిక దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు, బ్యాటరీ వీల్‌చైర్, ల్యాప్‌టాప్, మూడు చక్రాల రిక్షా, సాధారణ వీల్‌చైర్, చేతి కర్రలతో పాటు బోధన, అభ్యాసానికి సంబంధించి సహాయ ఉపకరణాలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. దివ్యాంగులతో పాటు ఇంటర్ ఆపైన విద్యనభ్యసిస్తున్న వారు https://tsobmms.cgg.gov.in/ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 25వ తేదీలోగా అన్ని ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకుని, కాపీలను జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం అందజేయాలని సూచించారు.

51 మందికి సదరం సర్టిఫికెట్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ లత

మధిర/ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలోని మధిరలో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంపులో 51 మంది దివ్యాంగులు సర్టిఫికెట్‌కు అర్హత సాధించారు. ఈ క్యాంపును మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత ఈ క్యాంపును ప్రారంభించగా, స్లాట్ బుక్ చేసుకున్న 140లో 99 మంది హాజరయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించిన వివిధ విభాగాల వైద్యులు 51 మందిని సర్టిఫికెట్‌కు అర్హులుగా నిర్ధారించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఇదేనా మీ పనితీరు ?

- కల్లూరు సీహెచ్‌సీ వైద్యులపై అదనపు కలెక్టర్ ఆగ్రహం



వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత

కల్లూరు/కల్లూరు రూరల్: కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యసేవలు, పరీక్షల్లో లోపాలపై వైద్యుడు లవన్ కుమార్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఆస్పత్రిలో కనీస సంఖ్యలో ప్రసవాలు జరగకపోవడం, టీహబ్‌లో పరీక్షల లక్ష్యాలను చేరుకోకపోవడంతో పాటు రికార్డు నిర్వహణపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అలాగే, మండలంలోని చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రిని కూడా అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ తనిఖీ చేసి ‘ఆరోగ్య మహిళ’లో భాగంగా వైద్యసేవలపై ఆరా తీశారు. డీఆర్డీఓ విద్యా చందన, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాం, ఎంపీపీ బీరవల్లి రఘు, ఎంపీడీఓ బి.రవికుమార్, ఎంపీఓ వీరస్వామి, డాక్టర్ తబుస్సుంతో పాటు డాక్టర్ లక్కినేని రఘు, సీహెచ్.కృష్ణారావు, లక్ష్మీ కాంతమ్మ, నాగేషరెడ్డి, సాకేత్ పాల్గొన్నారు.

తరగతులే తరువాయి..

ఖమ్మం కేంద్రంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ ఏడాది నుంచే బోధన ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) లెటర్ ఆఫ్ ఇండెంట్ విడుదల చేసింది. గతంలోనే ప్రభుత్వం మెడికల్ కళాశాల కోసం రూ.166 కోట్లు విడుదల చేయగా, ఇందులో రూ.9.6 కోట్లతో పాత కలెక్టరేట్ భవనం ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. అలాగే మరో రూ.3.25 కోట్లతో పాత కలెక్టరేట్, జిల్లా ఆస్పత్రిని అనుసంధానిస్తూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు. ఇక బోధనకు సంబంధించి ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల కేటాయింపు కూడా పూర్తయింది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

చురుగ్గా సాగుతున్న భవనం ఆధునికీకరణ పనులు



ఖమ్మం మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ అనుమతి

- ఈ ఏడాది నీట్ ద్వారా 100 సీట్లు భర్తీ
- చురుగ్గా పాత కలెక్టరేట్ ఆధునికీకరణ పనులు
- ప్రభుత్వ ఆస్పత్రి, పాత కలెక్టరేట్‌కు అనుసంధానంగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణం
- జిల్లా ప్రజల కల సాకారమైందన్న మంత్రి పువ్వాడ

మెడికల్ కళాశాల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి తప్పనిసరి కావడంతో ఈ ఏడాది జనవరిలో ఓసారి, మార్చిలో ఇంకోసారి నేషనల్ మెడికల్ కమిషన్ బృందం ఇక్కడ పర్యటించింది. ఖమ్మంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నాయా అని పరిశీలించడమే కాక జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని సౌకర్యాలు, మౌలిక వసతులు, లేబొరేటరీలు, లైబ్రరీ, హాస్టళ్లు, ఆస్పత్రి, వైద్యులు, ప్రొఫెసర్ల బోధనానుభవం తదితర అంశాలను నిశితంగా పరిశీలన చేశారు. వీటిపై సంతృప్తి చెందడంతో నేషనల్ మెడికల్ కమిషన్ మెడికల్ కళాశాల ఏర్పాటుకు లెటర్ ఆఫ్ ఇండెంట్ విడుదల చేయడంతో కళాశాల ప్రారంభానికి మార్గం సుగమమైంది.

మెడికల్ కళాశాలకు అనువుగా..

మెడికల్ కళాశాల కోసం జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌తో పాటు పాత కలెక్టరేట్, పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ కార్యాలయాల భవనాలు కేటాయించారు. మెడికల్ కళాశాల నిర్వహణకు అనువుగా వీటిని మార్చేందుకు ప్రభుత్వం కేటాయించిన రూ.9.6 కోట్లతో పనులు జరుగుతున్నాయి. పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని బాలుర హాస్టల్‌గా, ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని బాలికల హాస్టల్‌గా ఉపయోగించాలని నిర్ణయించి బోర్డులు కూడా ఏర్పాటుచేశారు. ఇక ఇక పాత కలెక్టరేట్‌ను బోధన అవసరాలకు వినియోగిస్తారు. ప్రాక్టికల్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంటాయి.

సెప్టెంబర్ నుంచి తరగతులు

ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుమతి జారీ అయిన నేపథ్యాన ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. నీట్ ద్వారా వంద సీట్లను భర్తీ చేయనుండగా, ప్రిన్సిపాల్, నలుగురు ప్రొఫెసర్లు, 24 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను కేటాయించారు. అలాగే, పాత కలెక్టరేట్, ప్రభుత్వ ఆస్పత్రిని అనుసంధానం చేస్తూ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.25 కోట్లు కేటాయించగా త్వరలోనే పనులు మొదలుకానున్నాయి.

> **సీఎం కేసీఆర్, మంత్రులకు కృతజ్ఞతలు**
>
> 
>
> ఖమ్మం మెడికల్ కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ లెటర్ ఆఫ్ ఇండెంట్ విడుదల చేసింది. దీంతో జిల్లా ప్రజల కల సాకారమైంది. ఈ విద్యాసంవత్సరం నుంచే వంద సీట్లతో తరగతులు ప్రారంభం కానున్నాయి. జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.
>
> – పువ్వాడ అజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి

> **వైద్య సేవలు మెరుగవుతాయి..**
>
> 
>
> మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ నుంచి అనుమతి లభించింది. ఇప్పటికే పాత కలెక్టరేట్‌లో ఆధునికీకరణ పనులు చివరిదశకు చేరాయి. ఈభవనాన్ని బోధనకు కేటాయించగా.. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ భవనాలు కూడా సిద్ధమయ్యాయి. జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందనుంది.
>
> – డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల

బీఆర్ఎస్‌ను ఎవరూ ఏమీ చేయలేరు..

- వచ్చే ఎన్నికల్లో నిన్ను రాజకీయ సమాధి చేస్తాం
- మాజీ ఎంపీ పొంగులేటిపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, పక్కన ఎమ్మెల్యే సండ్ర, మేయర్ నీరజ తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వందమంది శ్రీనివాసరెడ్డిలు వచ్చినా.. బీఆర్ఎస్ పార్టీని ఏమీ చేయలేరని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పొంగులేటిని రాజకీయ సమాధి చేస్తామని, దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించాలన్నారు. ప్రజాక్షేత్రంలో ఎవరైనా గెలవొచ్చు, ఓడిపోవచ్చు కానీ అహం భావంతో మాట్లాడొద్దని హితవు పలికారు. 2014లో ఆయన పక్కన ఉన్న వారిని గెలిపించుకోలేకపోగా.. ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడిస్తానని చెప్పడం గర్హనీయమని పేర్కొన్నారు.

గొంతు కోసింది నీవే..

ఎందరినో రాజకీయంగా గొంతు కోసి పొంగులేటి ఈ స్థాయికి చేరారని తాతా మధు ఆరోపించారు. పువ్వాడ నాగేశ్వరరావుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాటిచ్చి బయటకు రాగా, రాంరెడ్డి వెంకటరెడ్డి సతీమణికి ఎన్నికల్లో మద్దతిస్తానని మాట ఇచ్చి తప్పారన్నారు. 2018 ఎన్నికల్లో తుమ్మలను, కొత్తగూడెంలో జలగం వెంకట్రావును ఓడించింది, కూరాకుల నాగభూషణంను ఆర్థికంగా ఇబ్బంది పెట్టింది పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాదా అని ప్రశ్నించారు. ఆరు నెలలకే తత్వం బోధపడిందని చెబుతున్న ఆయన ఇన్నాళ్లు బీఆర్ఎస్‌లో ఎందుకు కొనసాగారో చెప్పాలన్నారు. ఆయన ముఖం చూసి కాకుండా వైఎస్.రాజశేఖరరెడ్డిని చూసి గెలిపించారని, అప్పుడు కాంగ్రెస్ అభ్యర్థులు లేకపోవడం వల్లే పొంగులేటి విజయం సాధించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో తప్ప జనరల్ స్థానాల్లో అభ్యర్థులను ఎందుకు ప్రకటించలేదో ఆయన సమాధానం చెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ, డీసీసీబీ, సుడా చైర్మన్లు లింగాల కమల్‌రాజ్, కూరాకుల నాగభూషణం, విజయ్, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ కమర్తపు మురళి, నాయకులు ఉప్పల వెంకటరమణ, డోకుపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

పంట నష్టాలపై నివేదిక సిద్ధం

- ప్రభుత్వానికి సమర్పించిన అధికారులు
- త్వరలోనే పరిహారం విడుదలయ్యే అవకాశం



ఏన్కూరు మండలంలో పంట నష్టం సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: గతనెల అకాల వర్షాలతో జిల్లాలో దెబ్బతిన్న పంటల వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధమైంది. మార్చి 17 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో అకాల వర్షాలు కురవగా మొక్కజొన్న, పెసర, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని 19,732 మంది రైతులకు చెందిన 31,038 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈమేరకు జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. ఈక్రమంలో ప్రభుత్వం పంట నష్టంపై సమగ్ర సర్వే చేయాలని ఆదేశించగా, 33 శాతం మేర పంటల నష్టపోయిన రైతులను పరిగణనలోకి తీసుకుని సర్వే చేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధి 157 గ్రామాల్లో పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించగా, ప్రధానంగా మొక్కజొన్న పంటను రైతులు నష్టపోయినట్లుగా తేల్చారు. అధికారుల సర్వేలో తేలిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతులు, పంటల వివరాలు, సర్వే నంబర్లు, బ్యాంక్ అకౌంట్ల వివరాలతో మంగళవారం ప్రభుత్వానికి సమర్పించారు. అయితే, ప్రభుత్వం ఆమోదించిన తర్వాత పంట నష్టం వివరాలను వెల్లడిస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. ఇదిలా ఉండగా బోనకల్, చింతకాని, ముదిగొండ, కొణిజర్ల, వైరా మండలాల్లో పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయని సర్వే ఆధారంగా నివేదికలో అధికారులు పొందుపర్చినట్లు సమాచారం.

రేపటి నుంచి ఎస్సెస్సీ ‘స్పాట్’

- సెయింట్ జోసెఫ్ పాఠశాలలో క్యాంపు ఏర్పాటు
- 1,409 మంది ఉద్యోగులకు విధుల కేటాయింపు



పరీక్షకేంద్రం వద్ద కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. దీంతో జవాబుపత్రాల మూల్యాంకనం గురువారం మొదలుపెట్టనున్నారు. నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఈనెల 21వ తేదీ వరకు స్పాట్ వాల్యూయేషన్ ఉంటుందని క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్న జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 2.18లక్షలు జవాబుపత్రాలు ఇప్పటికే వచ్చాయి. స్పాట్ వాల్యూయేషన్ కోసం 1,409మందికి విధులు కేటాయించగా ఇందులో చీఫ్ ఎగ్జామినర్లు 122 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 897మంది, స్పెషల్ అసిస్టెంట్లు 390మంది ఉంటారు.

పకడ్బందీగా మూల్యాంకనం

ఎస్సెస్సీ జవాబుపత్రాల వాల్యూయేషన్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. కేంద్రంలో సమీపంలోకి ఎవరినీ అనుమతించకుండా బందోబస్తు ఏర్పాటుచేయన్నారు. ఉదయం 9–30నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంప్ ఉంటుందని, ఒక్కో ఉపాధ్యాయుడికి రోజుకు 40జవాబుపత్రాలు కేటాయిస్తామని అధికారులు తెలిపారు. వివిధ జిల్లాల్లో పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం సంచలనం సృష్టించిన నేపథ్యాన అధికారులు స్పాట్ వాల్యూయేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు

జిల్లాలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్రంలోని పలు జిల్లాలో చోటు చేసుకున్న ఘటనల నేపథ్యాన జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో ఎక్కడా ఇబ్బందులు ఎదురుకాలేదు. చివరిరోజు పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ తనిఖీ చేశారు. చివరిరోజు 103పరీక్ష కేంద్రాల్లో 16,873 మంది విద్యార్థులకు 16,826మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

వేసవి సెలవుల్లో పది క్రీడా శిక్షణ శిబిరాలు

ఖమ్మం స్పోర్ట్స్: వేసవి సెలవులు వస్తున్న దృష్ట్యా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన పది క్రీడా శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు. ఇప్పటికే తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ(శాట్స్) ఆధ్వర్యాన జిల్లాకు రూ.1.03లక్షల నిధులు విడుదలయ్యాయి. ఇందులో నుంచి ఒక్కో కేంద్రంలో పరికరాల కొనుగోలుకు రూ.5వేలు, శిక్షణ ఇచ్చే సీనియర్ క్రీడాకారుడు, పీఈటీ, పీడీలకు రూ.4వేల చొప్పున ఇచ్చేందుకు నిర్ణయించారు. జిల్లాలో ఆదరణ కలిగిన క్రీడలకు మాత్రమే శిబిరాలు ఏర్పాటుచేయాలని శాట్స్ సూచించిన నేపథ్యాన జిల్లా యువజన క్రీడల శాఖ ప్రణాళిక రూపొందిస్తోంది. గతంలో జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయగా, ఈసారి పది క్రీడాంశాలకే మాత్రమే పరిమితమవుతుండడం గమనార్హం. వీటికి తోడు జిల్లా కేంద్రంలోనూ పది వరకు శిక్షణ శిబిరాలు ఏర్పాటుచేయాలనే యోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండండి

అధికారులతో కలెక్టర్ గౌతమ్



ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో యాసంగి(రబీ) ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన పౌర సరఫరాలు, మార్కెటింగ్, గ్రామీణాభివృద్ధి, సహకార, రవాణా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దిగుబడి అంచనా మేరకు కొనుగోలుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో షామియానాలు, తాగునీరు ఏర్పాటుచేయాలని, గన్నీబ్యాగులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ పరీక్ష యంత్రాలు సమకూర్చుకోవాలని సూచించారు. జిల్లాలో ధాన్యం సేకరణకు 230 కేంద్రాలు ఏర్పాటుచేస్తుండగా, 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, డీఎం సోములు, డీఆర్డీఓ విద్యాచందన, డీసీఓ విజయకుమారి, ఆర్‌టీఓ కిషన్‌రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మా రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

జీఓలు 58, 59 ద్వారా స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న పట్టాలు ఇవ్వడంపై దృష్టి సారించాలని కలెక్టర్ గౌతమ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లతో దరఖాస్తులపై సమీక్షించారు. స్థల క్రమబద్ధీకరణతో లాభాలను ప్రజలకు వివరించి ఫీజు చెల్లించేలా చూడాలని తెలిపారు. అదనపు కలెక్టర్ ఏ.మధుసూదన్, డీఆర్వో శిరీష, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు పూలే..

జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మధు, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, అదనపు కలెక్టర్ మధుసూదన్ తదితరులు



నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమ్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి ప్రజాప్రతినిధులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన జెడ్పీ హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించాక ఆయన సేవలను వెల్లడించారు. పూలే సామాజిక విప్లవకారుడని, ఆయన ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, నామా నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, ఎమ్మెల్సీ మధు, కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్, మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత, రైతుబంధు సమితి జిల్లా చైర్మన్ నల్లమల్ల వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖాధికా రి జ్యోతి, ఉత్సవ నిర్వహణ కమిటీ బాధ్యులు పిండిప్రోలు రామ్మూర్తి, మేకల సుగుణారావు, కత్తి నెహ్రూగౌడ్, బత్తిని మధుగౌడ్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు, బొమ్మ రాజేశ్వరరావు, చిలకల వెంకటనర్సయ్య, వెంకటరమణ, వల్లెపు సోమరాజు, జక్కుల వెంకటరమణ, దుంపటి నగేష్, మదూరి సైదారావు పాల్గొన్నారు.

పదికి పది స్థానాలు మావే..

- అసెంబ్లీ నీ సొత్తేం కాదు..
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీరు మార్చుకోవాలి
- సత్తుపల్లి బీఆర్ఎస్ సమ్మేళనంలో ఎంపీ నామా నాగేశ్వరరావు
- హాజరైన ఎంపీలు పార్థసారథిరెడ్డి, వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే సండ్ర



బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందచేస్తున్న ఎంపీలు నాగేశ్వరరావు, పార్థసారథిరెడ్డి, రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర, ఎమ్మెల్సీ మధు

సత్తుపల్లి: అసెంబ్లీ గేటును తాకనివ్వవా.. ప్రజల తీర్పు నువ్వే చెబుతావా.. ప్రజలంటే అంత చులకనా.. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇకనైనా తీరు మార్చుకోవాలి.. సీఎం కేసీఆర్‌పై ఇష్టమున్నట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సత్తుపల్లి పట్టణ స్థాయి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఎంపీ నాగేశ్వరరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ కుటుంబ సభ్యులంతా ఏకమై ఉమ్మడి జిల్లాలోని పదికి పది అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని తీరుతామని స్పష్టం చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టడంతోనే ఆయనను పక్కన పెట్టి తనకు ఎంపీ సీటు ఇచ్చారని తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో తెలంగాణ పచ్చగా కళకళలాడుతోందని చెప్పారు. అభివృద్ధి చూసైనా పొంగులేటి తన తీరు మార్చుకోవాలని ఎంపీ సూచించారు. కాగా, ఇటీవల ప్రధాని నేషనల్ హైవేకు శంకుస్థాపన చేయగా ఎంపీగా తనను ఆహ్వానించకపోవడం జిల్లా ప్రజలను అవమానించడమేనని నాగేశ్వరరావు అన్నారు.

ఇది ప్రజల పండుగ

సీఎం కేసీఆర్ ఆలోచనలతోనే ప్రజలందరినీ ఒక కుటుంబంగా భావించి ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటుచేస్తుండడంతో అందరి పండుగగా భావిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి అన్నారు. కేసీఆర్ నేతృత్వాన అమలుచేస్తున్న పథకాలతో అన్నివర్గాలకు మేలు జరుగుతుండగా.. ఇంకా ఏమైనా సూచనలు వస్తాయనే ఆలోచనలతో ఈ భేటీలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కేసీఆర్ జీవించి ఉన్నంతకాలం బీఆర్ఎస్ అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. పొంగులేటికి దమ్ముంటే సొంత పార్టీ పెట్టుకుని.. తనకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే ఏం చేస్తారో చెప్పాలని సూచించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ అసెంబ్లీ గేటు తాకనివ్వమని చెప్పడానికి శ్రీనివాసరెడ్డి ఎవరని ప్రశ్నించారు. అంతిమ నిర్ణేతలు ప్రజలే తప్ప ఆయన కాదని పేర్కొన్నారు. జనరల్ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించకుండా ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లోనే ప్రకటించడంతో ఆయన తీరు వెల్లడైందన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సత్తుపల్లిని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. తొలుత జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, బీఆర్ఎస్ కార్యకర్త చంద్రయ్య కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కు అందజేశా రు. ఈసమావేశంలో డీసీసీబీ, డీసీఎంఎస్, మున్సిపల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు కూరాకుల నాగభూణం, రాయల శేషగిరిరావు, కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావుతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, తోట సుజలరాణి, వనమా వాసు, దొడ్డా హైమావతి, కూసంపూడి రామారావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎస్.కే.రఫీ, మల్లూరు అంకమరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారులకు వైద్యపరీక్షలు


ఎంసీహెచ్‌కు వచ్చిన చిన్నారులు

ఖమ్మం వైద్యవిభాగం: నగరంలోని బాలసదన్‌లో ఉంటున్న పలువురు చిన్నారులకు జ్వరంతో పాటు అనారోగ్య సమస్యలు రావటంతో మంగళవారం నిర్వాహకులు పెద్దాస్పత్రికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 23 మంది చిన్నారులకు వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించారు. ఇందులో పలువురు రక్తహీనతతో బాధపడుతుండగా, మరికొందరు వైరల్ ఫీవర్ బారిన పడినట్లు తేలింది. దీంతో అవసరమైన మందులు ఇచ్చి పంపించారు.

పరీక్ష కేంద్రాల్లో తనిఖీ

కారేపల్లి/ముదిగొండ: జిల్లాలో పలు పదో తరగతి పరీక్ష కేంద్రాలను డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసాచారి మంగళవారం తనిఖీ చేశారు. కాగా, కారేపల్లి జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ కేంద్రానికి డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ జయరాజ్ రాగా గేటు వద్ద పోలీసు సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించారు. ఇక ముదిగొండ మండలంలోని ముదిగొండ, ముత్తారం, బాణాపురం, వల్లభిలోని పరీక్ష కేంద్రాలను జిల్లా జేడీ శ్రీనివాసాచారి, స్క్వాడ్ ఆఫీసర్ జయరాజు, ఎంఈఓ ఇందిరాజ్యోతి తనిఖీ చేశారు.

గుండెపోటుతో మార్కెట్ కార్యదర్శి మృతి


చౌదర్‌రెడ్డి (ఫైల్)

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి కె.చౌదర్‌రెడ్డి (57) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. మార్కెట్ కార్యదర్శిగా 2018 జూన్ 19న బాధ్యతలు స్వీకరించిన ఆయన, రైతులకు విస్తృత సేవలందిస్తూనే మార్కెట్ ఆదాయం గణనీయంగా పెరిగేలా కృషి చేశారు. కాగా, చౌదర్ మృతిపై మార్కెట్ ఉద్యోగులు, రైతు సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఏన్కూరు: అనారోగ్య సమస్యలు తట్టుకోలేక ఎలుకల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన బుర్రి శాంతి కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో ఆమె 7వ తేదీన ఎలుకల మందు తాగగా గుర్తించిన సోదరుడు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెంలో రైతు గోదా తిరుమలికి చెందిన మూడెకరాల మొక్కజొన్న పంట అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు మంగళవారం మంటలు అంటుకున్నాయి. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చే లోగా రూ.2లక్షల విలువైన పంట కాలిపోయింది రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈమేరకు ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

రూ.18.50లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం ఎల్‌బీ.నగర్‌కు చెందిన హోటల్ వ్యాపారి కె.కల్యాణ్‌కుమార్ మంగళవారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.18.50 లక్షలకు ఐపీ దాఖలు చేశారు. వ్యాపారాభివృద్ధి కోసం తీసుకున్న అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందని చెబుతూ నలుగురిని ప్రతివాదులుగా పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు.

బాలిక మృతదేహం తండ్రికి అప్పగింత

ఖమ్మంక్రైం: ఖమ్మం చర్చికాంపౌండ్ ప్రాంతంలో సోమవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందిన బాలిక శ్రీవల్లి మృతదేహాన్ని పంచనామా అనంతరం ఆమె తండ్రి బీకూకు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అప్పగించారు. శ్రీవల్లిని తల్లి గంగ, ఆమె ప్రియుడు వినోద్ హత్య చేసి ఉరిగా చిత్రీకరించినట్లు ఆయన ఫిర్యాదు చేయడంతో పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, మెడ భాగంలో ఎముక విరిగినట్లుగా పోస్టుమార్టంలో నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,401	6,600
కందులు	7,900	7,200
మిర్చి	24,500	17,000
తాలు మిర్చి	14,500	9,000
పత్తి	7,900	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,943

ఉల్లాసంగా.. ఉత్సాహంగా !


పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు


పరీక్షలు ముగియడంతో విద్యార్థుల్లో ఆనందం


సరదాగా స్నేహితులతో..


హాస్టల్ నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థి

పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి పరీక్ష రాసి కేంద్రాల నుంచి బయటకు రాగానే విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొట్టారు. స్నేహితులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. పరీక్ష ఎలా రాశారో తెలుసుకున్నారు. వివిధ కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ చదవనుండదంతో మళ్లీ కలుస్తామో, లేదో అన్న భారమైన హృదయాలతో బయలుదేరారు. అలాగే, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులను తల్లిదండ్రులకు సామగ్రితో సహా తీసుకెళ్లారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

- పార్టీ సమ్మేళనంలో వైరా ఎమ్మెల్యే రాములునాయక్
- అర్ధంతరంగా ముగిసిన సభ
- భోజనాల వద్ద గలాటా, చేయి చేసుకున్న ఎస్సై


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: రాష్ట్రంలో మూడోసారి కూడా బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడమే ఖాయమని.. ఎవరెన్ని ప్రగల్భాలు పలికినా ఇది జరిగి తీరుతుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ స్పష్టం చేశారు. వైరా మండలం ఖానాపురంలో మండల స్థాయి బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని పార్టీ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనాలతో పార్టీ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను పార్టీ శ్రేణులకు ప్రజలకు వివరించాలని సూచించారు. తొలుత బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేకు సంప్రదాయ నృత్యాలు, ర్యాలీలతో స్వాగతం పలికారు. ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, నాయకులు పసుపులేటి మోహనరావు, కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, మచ్చా నరసింహారావు, షేక్ లాల్‌మహ్మద్, బీడీకే.రత్నం తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సమ్మేళనం


కార్యకర్తలను నిలువరిస్తున్న ఎస్‌ఐ వీరప్రసాద్

ఖానాపురంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం గందరగోళంగా ముగిసింది. ఉదయం పదిన్నరకు సభ ప్రారంభం కాగా, ఎమ్మెల్యే రాములునాయక్ సహా ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు మాట్లాడారు. ప్రసంగాలు మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగగా.. ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి తదితరులు వస్తారని తెలిపారు. కానీ సత్తుపల్లిలో సమావేశం ముగించుకుని వారు రావడం ఆలస్యమవుతుండడం.. అప్పటికే మధ్యాహ్నం 2గంటలు దాటడంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు భోజనాలు ఏర్పాటుచేసిన మామిడి తోటలోకి వెళ్లారు. అక్కడ వైరా ఎస్‌ఐ వీరప్రసాద్ పార్టీ శ్రేణులను అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. అయినా కార్యకర్తలు వెళ్లడంతో తోపులాట జరిగింది. భోజనం పెట్టలేనప్పుడు ఎందుకు పిలిచారని నిర్వాహకులపై వారు మండిపడ్డారు. ఒక దశలో ఎస్‌ఐ వీరప్రసాద్ కొందరు కార్యకర్తలపై చేయి చేసుకోగా, ఇక్కడ పరిస్థితులను ఎంపీలకు ఎమ్మెల్యే రాములునాయక్ ఫోన్‌లో చెప్పగా వారు రావడం లేదని తెలిసింది. దీంతో ఆయన అసహనం వ్యక్తం చేస్తూ సభను అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయారు.

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు


కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, సీఈఓ అప్పారావు


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్/నేలకొండపల్లి: కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కలెక్టరేట్‌లో ఆయనను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ తదితరులు కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు నందగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, సీఈఓ వీ.వీ.అప్పారావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరాంతో పాటు వివిధ శాఖల అధికారులు కూడా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నేలకొండపల్లికి చెందిన స్వాతంత్ర సమరయోధుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వున్నం వెంకయ్య, సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ కూడా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపి బౌద్ధక్షేత్రం చరిత్ర పుస్తకాన్ని అందించారు. ఇంకా పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సాయంత్రం కలెక్టర్ గౌతమ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, నియోజకవర్గంలో రామన్నపేట, దానవాయిగూడెం, కైకొండాయిగూడెంల్లో జీఓ 58, 59 ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఇళ్ల పట్టాలు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

మండలానికి 50 మంది

- అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తీసుకెళ్లేలా ఏర్పాట్లు

నేలకొండపల్లి: హైదరాబాద్‌లో నిర్మించిన భారీ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఈనెల 14వ తేదీన జరగనుంది. ఈమేరకు జిల్లాలో నియోజకవర్గానికి 300మంది చొప్పున హాజరయ్యేలా చూడాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో మండలానికి ఒక బస్సు కేటాయిస్తూ 50మందిని తీసుకురావాలని జిల్లా అధికారులకు బాధ్యతను ఎంపీడీఓలకు అప్పగించారు. ఈమేరకు వారు ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించడంలో నిమగ్నమయ్యారు. కాగా, హైదరాబాద్ తీసుకెళ్లే వారికి రవాణా సౌకర్యంతో పాటు టీ, భోజన ఏర్పాట్లు ప్రభుత్వం సమకూరుస్తుంది. ఈసందర్భంగా నేలకొండపల్లి ఎంపీడీఓ కె.జమలారెడ్డి మాట్లాడుతూ మండలం నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లే 50 మంది జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో అన్ని గ్రామాల వారికి ప్రాధాన్యత కల్పించనున్నట్లు చెప్పారు.

సామెతల పుస్తకం వెలువరించిన జిల్లా జడ్జి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, తదితరులు

ఖమ్మంలీగల్: నిత్యం పని ఒత్తిడిలో ఉంటున్నా, సాహిత్య అభిలాషతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సామెతలతో కూడిన పుస్తకాన్ని వెలువరించారు. ఈ పుస్తకాన్ని మంగళవారం జిల్లా కోర్టులో న్యాయశాఖ ఉద్యోగులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ నిత్యజీవితంలో సామెతలను ఉపయోగిస్తామని.. తమకు తాము ఆదర్శంగా ఉండమే కాక ఇతరులకు మార్గదర్శకంగా ఉండేలా సామెతలు దోహదపడతాయని చెప్పారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ జావిద్ పాషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావుతో పాటు ఇమ్మడి లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, రాధేశ్యాం, సింగం ఓంకార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో జిల్లా కవులకు సత్కారం


కవి చిననర్సయ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు


అశోక్‌ను సన్మానిస్తున్న దృశ్యం


గోవిందరావును సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్/కూసుమంచి/నేలకొండపల్లి: శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన తిరుపతిలో నిర్వహించిన నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో జిల్లాకు చెందిన పలువురు కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 48 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు పలు రికార్డులు దక్కాయి. ఇందులో కవి సమ్మేళనం, పద్య సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించగా, జిల్లాకు చెందిన కట్టెకోల చిన నర్సయ్య, ఉబ్బేపల్లి అశోక్, కణతాల గోవిందరావు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, లెనిన్ శ్రీనివాస్, కొంపెల్లి రామయ్య, కొత్తపల్లి కృష్ణారావు, ఎడవల్లి శైలజ, వెంకటరాణాప్రతాప్, హచ్యానాయక్, గరిడేపల్లి శోభనాద్రి, రెంటాల చిన్న హుస్సేన్, మందుల వీరభద్రం తదితరులు పాల్గొనగా, వీరిని నిర్వాహకులు సత్కరించారు.

అనుమతి ఇవ్వకపోతే అంతే...

- టీఎస్ బీపాస్ అమలుకు పకడ్బందీ చర్యలు

ఖమ్మంమయూరిసెంటర్: నగర, పురపాలక సంస్థల పరిధిలో భవన నిర్మాణాలకు గడువులోగా అనుమతులు జారీ చేసేందుకు ప్రభుత్వం టీఎస్ బీపాస్‌ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో అనుమతులు జారీ చేయాలని స్పష్టం చేసింది. అయితే, కొన్ని చోట్ల అధికారులు జాప్యం చేస్తుండడంతో అలాంటి వారికి జరిమానా విధించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా అలసత్వం వహించిన రెవెన్యూ శాఖకు సంబంధించి ఖమ్మం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కు సీడీఎంఏ అధికారులు పెనాల్టీ విధించారు. ఆయన పరిధిలోని 26 దరఖాస్తులను గడువులోగా పరిశీలించి అనుమతికి సిఫారసుకు చేయక పోవడంతో రూ.3వేలు జరిమానా విధిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పకడ్బందీగా ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్లు


మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వ్యాపార సముదాయాల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజుల పకడ్బందీగా వసూలు చేయాలని కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కేఎంసీ కార్యాలయంలో మంగళవారం ఆయన రెవెన్యూ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశమై మాట్లాడారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోని వారు వెంటనే చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. లేనిపోంలో జరిమానా విధించాలని, లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారికి నోటీసులు ఇచ్చి అవసరమైతే సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి, ఆర్‌ఓ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై లైంగిక దాడి

ఖమ్మం అర్బన్: ఖమ్మం ప్రశాంతినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న వివాహితపై ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన రుద్రాక్ష నరేష్ లైంగికి దాడికి యత్నించాడు. ఈనెల 5న భర్త ఇంట్లో లేని సమయాన వచ్చిన నరేష్ ఆమెపై లైంగిక దాడికి యత్నించగా కేకలు వేయడంతో పారిపోయాడు. ఆమె భర్త వచ్చాక మంగళవారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

వైన్ షాపులో చోరీ

రూ 3.60 లక్షల మందు మాయం


సీసీ పుటేజీని పరిశీలిస్తున్న ఎస్సై సాయికుమార్

ఏన్కూరు: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహ వైన్స్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... ఏన్కూరులోని జన్నారం క్రాస్‌రోడ్డు సమీపాన వైన్స్‌లోకి సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు, ట్యూబ్ లైట్ వైర్లు కట్ చేశాక తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. కాగా, కౌంటర్‌లో నగదు లేకపోవడంతో రూ.3.60లక్షల విలువైన 52 కాటన్ల మందును బయటకు తీసుకొచ్చి అప్పటికే సిద్ధం కాగా ఉన్న వాహనంలోకి ఎక్కించారు. అలికిడికి మేల్కొన్న వాచ్‌మెన్ టార్చ్ లైట్ వేయగా వాహనంతో సహా పారిపోయారు. దీంతో వాచ్‌మెన్ వైన్స్ యాజమానికి సమాచారం ఇవ్వగా ఆయన ఫోన్ చేయడంతో పోలీసులు చేరుకుని వివరాలు ఆరా తీశారు. అలాగే, మంగళవారం ఉదయం ఎస్సై సాయికుమార్ వచ్చి దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపాన మంగళవారం రాత్రి కారు ఢీకొట్టిన ఘటనలో బొక్కా చిన్నా(52) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చంద్రానగర్‌కు చెందిన చిన్నా మండలంలోని పందిళ్లపల్లి స్టేషన్ సమీపాన రైల్వే పనులకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం పనులు ముగిశాక ఆయన నడుస్తూ వెళ్తుండగా బోనకల్ వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నా అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే, కారు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు తెలిపిన నంబర్ సాయంతో గుర్తించినట్లు ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు. కాగా, చిన్నా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డీసీఎంను ఢీకొట్టిన ద్విచక్రవాహనం

- ముగ్గురికి తీవ్రగాయాలు

ముదిగొండ: మండలంలోని అయ్యగారిపల్లి శివాలయం సమీపాన ఆగి ఉన్న మిని డీసీఎంను ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గంధసిరికి చెందిన వల్లంకొండ అరవింద్, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వుకు చెందిన నాగరాజు, నకిరేకల్‌కు చెందిన మరొకరు ఖమ్మంలోని కరుణగిరి వద్ద బధరుల పాఠశాలలో చదువుతున్నారు. వీరు ముగ్గురు మంగళవారం సాయంత్రం ఖమ్మం నుంచి గంధసిరికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో అయ్యగారిపల్లి వద్ద ఆగి ఉన్న మినీ డీసీఎంను అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు వీరిని ఆటోలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టలేం..

నేలకొండపల్లి: కొనుగోలు కేంద్రాన్ని తాము నిర్వహించలేమని గ్రామ సమాఖ్య బాధ్యులు డీఆర్డీఏ అధికారులలేఖ అందజేశారు. మండలంలోని అనాసాగారంలో ఐదేళ్లుగా ఐకేపీ ఆధ్వర్యాన స్వయం కృషి సమాఖ్య బాధ్యులు ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 85 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, రెండు సీజన్లకు సంబంధించి 70 శాతం మేర కమీషన్ అందింది. ఆ రెండు సీజన్లలో మిగతాదే కాక మరో మూడు సీజన్లకు సంబంధించి అసలు కమీషనే రాలేదు. దీంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహించలేమని లేఖ అందజేశారు.

ఈ విషయంతెలియడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా, అధికారులు వెంటనే స్పందించి ప్రత్యామ్నాయంగా మరో సమాఖ్య ఆధ్వర్యాన కేంద్రం ప్రారంభించాలని వారు కోరుతున్నారు.


రోడ్లపై ఆరబోసిన ధాన్యం

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

ఎర్రుపాలెం: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామ, ఆడపడుచులు పెడుతున్న వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎస్‌ఐ ఎం.సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భీమవరానికి చెందిన యడ్లపల్లి దివ్య(23)కు మీనవోలు వాసి భరత్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో రూ.3 లక్షల నగదు, ఎకరంన్నర పొలం, బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చినా, ఏడాది తర్వాత దివ్య భర్త యడ్లపల్లి భరత్, అత్తామామలు, ఆడపడుచు దివ్య మరో రూ.5 లక్షలు తీసుకురావాలని వేధింపులు మొదలుపెట్టారు. ఇటీవల పెద్దమనుషుల సమక్షాన రూ.2లక్షలను దివ్య తల్లిదండ్రులు ఇచ్చినా వారు సంతృప్తి పడలేదు. దీంతో 10వ తేదీన ఇంటి వద్దే గడ్డి మందు తాగిన దివ్యను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం మృతి చెందగా, తహసీల్దార్ తిరుమలాచారి సమక్షాన పంచనామా చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. కాగా, మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

బీసీ కుల గణనకు జై

- ఏపీలో నిర్వహించేందుకు సీఎం వైఎస్ జగన్ కీలక నిర్ణయం



సాక్షి, అమరావతి : కుల గణన చేపట్టాలన్న బీసీ సంఘాల న్యాయమైన డిమాండ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జైకొట్టింది. వెనుకబడిన వర్గాల ఆశల అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. వీరి న్యాయమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా సీఎం వారికి నైతిక మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ తాజా నిర్ణయంపట్ల బీసీ సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. మరోవైపు.. దేశవ్యాప్త జనాభా లెక్కల సేకరణలో బీసీ కులం కాలమ్ చేర్చి కుల గణన చేపట్టాలంటూ కేంద్రాన్ని కోరుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసింది. పైగా ఇప్పుడు రాష్ట్ర పరిధిలో కుల గణనకు సన్నద్ధమైంది. దీనిపై అధ్యయనానికి రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటుచేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మంగళవారం వెల్లడించారు. త్వరలో మంత్రి వేణు నేతృత్వంలో కమిటీని కూడా ప్రభుత్వం ప్రకటించనుంది. ఇప్పటికే బీసీ కుల గణనకు ముందుకొచ్చిన బిహార్, పంజాబ్, ఒడిశా రాష్ట్రాల్లో ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం రాష్ట్రంలో బీసీ కుల గణనకు శ్రీకారం చుట్టేలా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తుంది. తద్వారా జనాభా లెక్కల సేకరణలో కులం కాలమ్ చేర్చి కుల గణన చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులతో సింగరేణి అధికారుల భేటీ

ఉక్కునగరం: తెలంగాణకు చెందిన సింగరేణి అధికారుల బృందం మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ముడి సరుకులు, నగదు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) కోసం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. ఈవోఐకు ఈ నెల 15న గడువుగా నిర్ణయించారు. ఈవోఐలో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆసక్తి కనబరుస్తుందన్న వార్తల నేపథ్యంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, సుబ్బారావు, బలరాంతో పాటు మరో ఇద్దరు జీఎంలు ఉక్కు పరిపాలన భవనంకు వచ్చారు. ఉక్కు సీఎండీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) వేణుగోపాలరావు, డైరెక్టర్ (కమర్షియల్) డీకే మొహంతి, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఏకే బాగ్చీ, మార్కెటింగ్ అధికారులతో సమావేశమై ఈవోఐ విధి విధానాల గురించి చర్చించినట్లు సమాచారం.

అడ్డంగా దొరికినా అడ్డదారిలోనే! 'కల్తీ' కల్లోలం!

ఆర్బీఐ వారించినా రామోజీ బుద్ధి వంకరే


సాక్షి, అమరావతి: చట్టాలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడటంలో తనకు సాటిలేదని చెరుకూరి రామోజీరావు మళ్లీ మళ్లీ నిరూపించుకుంటూనే ఉన్నారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించడమే కాకుండా తన చర్యను నిస్సిగ్గుగా సమర్థించుకునేందుకు బరితెగించడం ఆయనకే చెల్లింది. తటస్థుల ముసుగులో టీడీపీ సానుభూతిపరులతో మాట్లాడిస్తూ మరో నాటకానికి తెర తీశారు. డిపాజిట్ల సేకరణ ముమ్మాటికీ చట్టవిరుద్ధమేనని ఆర్బీఐ కొరడా ఝుళిపించడం, అడ్డంగా దొరికిపోవడంతో కేసు విచారణ ఇంకా కొనసాగుతుండగానే నేరపూరిత కుట్రతో నాడు 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'ను రామోజీ మూసివేశారు. ఇక ఇప్పుడు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్' పేరిట రశీదుల రూపంలో అక్రమ డిపాజిట్ల సేకరణకు బరితెగించారు. చందాదారుల సొమ్ముతో అక్రమ ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాలతో ఈ అక్రమాల బాగోతం మరోసారి బట్టబయలైంది.

మార్గదర్శివి అక్రమ డిపాజిట్లే...

'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరిట చెరుకూరి రామోజీరావు అక్రమ డిపాజిట్లు సేకరించారని ఆర్బీఐ తేల్చింది. ఈమేరకు 2006 నవంబరులో కేంద్ర ఆర్థిక శాఖకు లిఖితపూర్వకంగా తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఓ లేఖ ద్వారా వెల్లడించింది. డిపాజిట్ల సేకరణను సమర్థించుకుంటూ రామోజీరావు చేసిన వాదన పూర్తిగా అహేతుకం, చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఆదాయపన్ను చట్టం ప్రకారం తమ వ్యాపార సంస్థలన్నీ హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్) కిందకు వస్తాయి కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చని, ఆర్బీఐ చట్టంలోని '45 ఎస్' నిబంధన తమకు వర్తించదని రామోజీ అడ్డగోలుగా వాదించారు. దీన్ని ఆర్బీఐ పూర్తిగా తిరస్కరించింది. 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరిట వసూలు చేసినవి అక్రమ డిపాజిట్లేనని స్పష్టం చేసింది.

కొత్తగా సేకరించొద్దు.. రెన్యువల్ చేయొద్దు

మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు రూ.2,204.42 కోట్లు అక్రమంగా డిపాజిట్లుగా సేకరించారని ఆర్బీఐ వెల్లడించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ తక్షణం డిపాజిట్ల సేకరణను నిలిపివేయాలని ఆదేశించింది. కొత్తగా డిపాజిట్లు సేకరించడం, కాలపరిమితి ముగిసిన పాత డిపాజిట్లు రెన్యూవల్ చేసేందుకు వీల్లేదని తేల్చిచెప్పింది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రామోజీరావు డిపాజిట్ల సేకరణను నిలిపివేశారు. అప్పటికే సేకరించిన రూ.2,204.42 కోట్లను డిపాజిట్‌దారులకు వెనక్కి ఇచ్చేస్తామని ఆర్బీఐకి లిఖితపూర్వకంగా తెలిపారు. విధిలేని పరిస్థితుల్లో తమ మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థను మూసివేశారు. నాడు దివంగత వైఎస్సార్ సకాలంలో స్పందించి 2.50 లక్షల మంది డిపాజిట్‌దారులు హక్కులను పరిరక్షించారు.



RESERVE BANK OF INDIA

To Govt. Of Andhra Pradesh, 29.12.2006

Chief General Manager in Charge
D.O.DNBS CO/01.02.007/2006-07 November 30, 2006

Dear Shri Amitabh Verma

Representation of Sri Vundavalli Arun Kumar, M.P. received through Dr. Y.S. Rajasekhara Reddy, Chief Minister, Andhra Pradesh regarding alleged irregularities being committed by Margadarsi Financiers, Hyderabad based HUF.

Please refer to Government's letter F.No 5/94/2006-BO.II dated November 10, 2006 on the captioned subject.A Status paper indicating the background in respect of Margadarsi Financiers is given in Annex.

2. In view of the letter under reference received from the Ministry, the Bank had called the representative of the unincorporated body (UIB) of discussion on November 13, 2006 and they were asked to a) Substantiate their stance that they are not covered under Section 45S of the RBI Act, 1934 and b) detail their plans for protection of the interest of the depositors. Pending submission of the replies, the UIB was advised neither to accept any fresh deposit nor renew the maturing deposits forthwith.

మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్ల సేకరణ అక్రమం అని చెబుతూ ఆర్‌బీఐ కేంద్ర ఆర్థిక శాఖకు రాసిన లేఖ... డిపాజిట్ల సేకరణ నిలిపివేయాలి, డిపాజిట్‌దారులకు డిపాజిట్ మొత్తానికి తిరిగి చెల్లించాలని ఆదేశించినట్టు పేర్కొన్న ఆర్‌బీఐ

2006లో ఆర్బీఐ ఏం చెప్పిందంటే..?

- 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'వి కచ్చితంగా అక్రమ డిపాజిట్లే
- నిబంధనలకు విరుద్ధంగా రూ.2,205 కోట్ల డిపాజిట్ల సేకరణ
- డిపాజిట్‌దారులకు తక్షణం డిపాజిట్ మొత్తాన్ని చెల్లించాలి
- కొత్తగా డిపాజిట్ల స్వీకరణ, పాతవి రెన్యువల్ చేయకూడదు

మళ్లీ అక్రమ డిపాజిట్లు సేకరణ

ఆర్బీఐ ఆదేశాలతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ దుకాణాన్ని మూసివేసిన రామోజీ ఈసారి మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో అక్రమ డిపాజిట్లకు తెరతీశారు. చందాదారులు పాడిన చిట్టీ మొత్తాన్ని వారికి పూర్తిగా చెల్లించకుండా రశీదుల రూపంలో డిపాజిట్లుగా వసూలు చేశారు. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు వసూలు చేయడం చిట్‌ఫండ్ చట్టం -1982కు విరుద్ధం. మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల నుంచి అక్రమ డిపాజిట్లను సేకరించి హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి తమ అనుబంధ సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్(తమిళనాడు)–చెన్నై, మార్గదర్శి చిట్‌ఫండ్స్(కర్ణాటక)–బెంగళూరులలో అక్రమ పెట్టుబడులు పెట్టారు. ముంబైలోని మ్యూచ్‌వల్ ఫండ్స్ కంపెనీలు, షేర్ మార్కెట్లో కూడా అక్రమ పెట్టుబడులుగా మళ్లించారు. ఇలా తన చేతి సొమ్ము రూపాయి పెట్టకుండా చందాదారుల కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టి ఆస్తులు కూడగట్టారని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైంది.



A LETTER FROM
RBI (Centeral Office) MUMBAI
to A.P Government.

Copy of of letter No. DNBS.CO. 4230/01.02.06-2007 dated 29th Drecembez 2006 of from Sri P. Krishnamurthy, Chief General Manager-in-Charge, Reserve Bank of India, Central Office, Mumbai addressed to Sri Paul Bhuyan, IAS, Special Chief Secretary to Government, Home Department, Government of Andhra Pradesh, A-Block, 3rd Floor, Secretariat, Hyderabad.

Dear Sir,

Please refer to your letter No. 37008/General.B/A2/2006-1 dated December 19, 2006 requesting certain information / documents etc. on Margadarsi Financiers, Hyderabad.

2. As you may be aware, the Reserve Bank of India draws its powers for regulation and supervision over the non-banking financial companies (NBFCs) from the provisions of Chapter III B of the Reserve Bank of India Act, 1934/ These powers include registration of NBFCs, inspecting their business, calling for information, calling for returns/statements on deposits and issuing directions. However, the Act does not provide for the Reserve Bank to issue directions. However, the Act does not provide for the Reserve Bank to issue directions or exercise other regulatory and supervisory powers as regards unincorporated bodies (UIBs) such as Margadarsi Financ' which is stated to belong to a Hindu Undivided Family (I 31 Since HUFs are not falling within the definition of a NBFC non-banking Insitution under Chapet III B of the RBI Act, 1934.

డిపాజిట్ దారుల ప్రయోజనాల పరరక్షణ కోసం సీఐడీ ద్వారా తగిన చర్యలు రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని ఆర్‌బీఐ రాసిన లేఖ

చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వమేనన్న ఆర్బీఐ

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని ఆర్బీఐ 2006లోనే స్పష్టం చేసింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ పెట్టుబడుల అంశంపై నాడు ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్‌బీఐకి ఫిర్యాదు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ద్వారా ఆర్బీఐ దృష్టికి తేవడంతో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. డిపాజిట్‌దారుల ప్రయోజనాలకు కాపాడాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేసింది. అక్రమ డిపాజిట్లు వసూలు చేసే ఆర్థిక సంస్థలపై చర్యలు తీసుకునే యంత్రాంగం ఆర్బీఐకి ప్రత్యేకంగా లేదని పేర్కొంది. ఆ తరహా ఆర్థిక నేరాలను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాల వద్ద సీఐడీ విభాగం ప్రత్యేకంగా ఉందని ఆర్బీఐ ప్రస్తావించడం గమనార్హం. ఆమేరకు ఏపీ ప్రభుత్వం కూడా 1999 రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది. నాడు ఆర్బీఐ ఆదేశాలతోనే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై చర్యలు చేపట్టింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక మోసాలపై అదే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటోంది. సోదాలు నిర్వహించి అక్రమాలు జరిగినట్లు వెల్లడి కావడంతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఏ–1గా చెరుకూరి రామోజీరావు, ఏ–2గా చెరుకూరి శైలజపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

▶ మొదటి పేజీ తరువాయి

108 అంబులెన్స్‌లో బంధువులు అతడిని జిల్లా జనరల్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ క్రమంలో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఐసీయూలో చికిత్స పొందుతూ ఆశన్న తెల్లవారుజామున 1.15 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. వైద్యులు సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. అతడి తమ్ముడు బెంగళూరు నుంచి వచ్చేసరికి సమయం పట్టడంతో మంగళవారం దహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విషయాన్ని ఆస్పత్రి వర్గాలు, ఎక్సైజ్‌శాఖ గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మరో ఇద్దరు ఐసీయూలో..

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఐసీయూలో మరో ఇద్దరు కల్తీ కల్లు బాధితులు చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన విష్ణుబాబు భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌లో పోస్టల్ శాఖలో ఏబీపీఎంగా చేస్తున్నాడు. ఆయనతో పాటు దొడ్డలోనిపల్లి గ్రామానికి చెందిన రేణుక ఐసీయూలో చికిత్స పొందుతోంది.



మృతుడు ఆశన్న

విష్ణుబాబుకు వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తుండగా.. పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. దొడ్డలోనిపల్లికి చెందిన రేఖతో పాటు మరో ఆరుగురికి సాధారణ వార్డులో చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.

ఆల్ఫ్రాజోలం మోతాదులో తేడా వల్లేనా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా మందు కల్లు విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. కల్లులో ప్రధానంగా నిషేధిత మత్తు పదార్థం ఆల్ఫ్రాజోలంను కలుపుతున్నారు. అయితే మోతాదులో తేడా రావడం వల్లే బాధితులు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రిలో అడ్మిట్ అయిన అందరిలో మెడ తిమ్మిర్లు, చేతులు వణకడం, తలవెనక్కి వాలడం, నాలుక బయటకు రావడం, నత్తి, శరీరంలో చలనం లేకపోవడం వంటి లక్షణాలు కన్పిస్తున్నాయి.

ఎవరూ కల్లు తాగి అడ్మిట్ కాలేదు..

కల్తీ కల్లు తాగి ఆస్పత్రిలో ఎవరూ అడ్మిట్ కావడం లేదు. కేవలం వింత వింత ప్రవర్తనతో పాటు ఫిట్స్ ఇతర సమస్యలతో వస్తున్నారు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు దాదాపు 25 మంది వరకు ఇలాంటి లక్షణాలతో అడ్మిట్ అయ్యారు. వీరిలో కొందరికి ఊపిరితిత్తుల సమస్యతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు నిర్ధారించాం. అందరికీ కావాల్సిన చికిత్స అందించి డిశ్చార్జి చేయడం జరుగుతుంది.

– డాక్టర్ రామకిషన్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

ఐదురోజులుగా ఆస్పత్రిలోనే..



మహబూబ్‌నగర్ పట్టణంలోని మోతీనగర్ ప్రాంతానికి చెందిన ఇంద్రజ ఈ నెల 7న కల్లు తాగి అస్వస్థతకు గురికావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయింది. ఆమె మాట్లాడలేని స్థితిలో ఉంది. సపర్యలు చేస్తున్న ఆమె తల్లి మాట్లాడుతూ.. 'ఐదు రోజుల నుంచి ఇక్కడే ఉంటున్నాం..ఇంద్రజకు కల్లు తాగే అలవాటు ఉంది.. పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడంతో ఆస్పత్రికి తీసుకొచ్చాం..' అని తెలిపింది.

రాష్ట్రంలో భారీగా కరోనా కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో జ్వరాలు, ఇన్‌ఫ్లుయెంజా కేసులు పెరగటం, తదితర కారణాలతో కరోనా కేసులు కూడా పెరుగుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. మంగళవారం 6,813 మందికి పరీక్షలు నిర్వహించగా..వారిలో 40 మంది కరోనా బారిన పడ్డారు. 196 మంది ఐసోలేషన్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కమ్యూనిస్టు నేత వెంకటయ్య కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: సీనియర్ కమ్యూనిస్టు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని వెంకటయ్య (98)మంగళవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన ప్రముఖ కమ్యూనిస్టు బొమ్మగాని ధర్మభిక్షం సోదరుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ తండ్రి. వెంకటయ్య భౌతికకాయాన్ని బుధవారం ఉదయం 8 గంటల వరకు ఎల్బీనగర్ లోని ఆయన కుమారుడు నాగభూషణం నివాసంలో సందర్శనార్థం ఉంచుతారు. అనంతరం సూర్యాపేటకు తరలించి మధ్యాహ్నం రెండు గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

జిల్లా వార్తలు

13న మెగా జాబ్ డ్రైవ్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యాన ఈనెల 13న మెగా జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.హవీలా, కెరీర్ గైడెన్స్ సెల్ సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి తెలిపారు. టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకులతో పాటు విప్రో, ముత్తూట్ ఫైనాన్స్ తదితరుల కంపెనీల బాధ్యులు పాల్గొని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు కలిగి 2019 - 2022 సంవత్సరాల మధ్య డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లు ఫొటో, ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 99490 55604 నంబర్‌లో సంప్రదించాలని వారు తెలిపారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి 16న పరీక్ష

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు ఈనెల 16వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా, 1,670మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. కాగా, 6వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10నుంచి 12గంటల వరకు, 7నుండి 10వ తరగతిలో ప్రవేశాల కోసం మధ్యాహ్నం 2నుండి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

గురుకులాల ప్రవేశ పరీక్ష..

ఖమ్మంమయూరిసెంటర్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6నుండి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఈనెల 16న పరీక్ష నిర్వహించనున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ ప్రత్యూష తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తెలంగాణ గురుకులాల వెబ్‌సైట్ నుండి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, ఉదయం 11నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

బుగ్గపాడులో పామాయిల్ సబ్ సెంటర్

సత్తుపల్లిరూరల్: రైతుల ఇబ్బందులు తీర్చేందుకు పామాయిల్ సబ్ సెంటర్ ఏర్పాటుచేసినట్లు ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి ఆకుల బాలకృష్ణ తెలిపారు. గతంలో సత్తుపల్లిలో సెంటర్ ఉండగా.. రైతులకు మరింత చేరువ చేసేందుకు మండలంలోని బుగ్గపాడులో ఇంకోసెంటర్ ఏర్పాటుచేసినట్లు చెప్పారు. బుగ్గపాడు, నాగుపల్లి, నాచారం రైతులు పామాయిల్ గెలలను ఇక్కడ దింపితే, నేరుగా ఫ్యాక్టరీకి వెళ్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఉద్యోగులు నాయుడు రాధాకృష్ణ, కృష్ణారావు, అప్పారావుతో పాటు రైతులు శివబాబు, ప్రసాద్, కృష్ణారావు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల్లో చిగురిస్తున్న ఆశలు

- ముగిసిన నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్
- క్రమబద్ధీకరణకు ఎదురుచూపులు
- వివరాల సేకరణలో నిమగ్నమైన అధికారులు
- రెగ్యులరైజ్ చేస్తే ఉమ్మడి జిల్లాలో 818 మందికి లబ్ధి



ఖమ్మం సహకారనగర్: ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం కొన్నేళ్ల క్రితం కొత్తగా గ్రామపంచాయతీలను ఏర్పాటుచేసింది. ఈక్రమంలోనే వందలాది మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. పాలకవర్గాలకు తోడు వీరి కృషితో పంచాయతీల్లో పారిశుద్ధ్యం, ఇతర సేవలు అందుతుండగా పల్లెలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయి. అయితే, కొన్నేళ్ల క్రితం నియమించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ మంగళవారంతో ముగిసింది. దీంతో క్రమబద్ధీకరణకు వీరు ఆశతో ఎదురుచూస్తుండగా, ప్రభుత్వం వివరాలు సేకరిస్తున్న నేపథ్యాన త్వరలోనే శుభవార్త వస్తుందని భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,070 జీపీలు

ఖమ్మం జిల్లాలో 20 మండలాలు, 589 గ్రామపంచాయతీలు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21మండలాలకు గాను 481 జీపీలు ఉన్నాయి. వీటి పరిధిలో నాటి లెక్కల ప్రకారం ఒక్కో పంచాయతీ కార్యదర్శి నాలుగు నుంచి ఏడు పంచాయతీల విధులు నిర్వర్తించేవారు. దీంతో 2019 సంవత్సరం ఫిబ్రవరిలో పాలకవర్గాలు ఏర్పడగా... ఏప్రిల్‌లో ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్)లను నియమించింది. తొలుత వీరికి ప్రొబేషనరీ కాలాన్ని మూడేళ్లుగా నిర్ణయించగా... ఆ తర్వాత మరో ఏడాది పెంచింది. ఈ కాల పరిమితి మంగళవారంతో ముగిసింది. తొలిరోజుల్లో రూ.15వేల వేతనం అందుకున్న వీరికి ప్రస్తుతం సుమారు రూ.29వేలు వస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో గ్రామాలు, కార్యదర్శుల వివరాలు

వివరం	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం
మండలాలు	20	21
గ్రామపంచాయతీలు	589	481
గ్రేడ్ - 1, 2, 3, 4 కార్యదర్శులు	105	102
జూనియర్ పంచాయతీ కార్యదర్శులు	463	355
ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు	21	24

డీపీఓలకు ఆదేశాలతో ఆనందం

జేపీఎస్‌ల ప్రొబేషనరీ పీరియడ్ మంగళవారంతో ముగియనుండగా కొన్నాళ్లుగా క్రమబద్ధీకరణపై చర్చ జరుగుతోంది. కానీ ఇప్పటి వరకు కూడా ప్రకటన వెలువడలేదు. ఇంతలోనే జిల్లాల్లోని జేపీఎస్‌ల సమగ్ర వివరాలను పంపించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ విషయం తెలిసిన జేపీఎస్‌ల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తే తాము కన్న కలలు సాకారం అవుతాయని వారు భావిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులను సంప్రదించగా కమిషనర్ కార్యాలయం సూచనల మేరకు వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

ఆందోళన చేయాలా, వద్దా

క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జేపీఎస్‌లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. కానీ కమిషనర్ కార్యాలయం నుంచి వివరాలు సేకరిస్తుండడంతో క్రమబద్ధీకరణపై ఆశలు కలుగుతున్నాయి. ఈ నేపథ్యాన ఆందోళనలు చేయాలా, వద్దా అనే మీమాంసలో కార్యదర్శులు ఉండిపోయారు.

బొగ్గు దుమ్ము లేకుండా చర్యలు చేపట్టండి

సత్తుపల్లిరూరల్: సింగరేణి సైలో బంకర్ల ద్వారా రైల్వే వ్యాగన్లలో బొగ్గు నింపే క్రమాన దుమ్ము లేవకుండా నీళ్లు స్ప్రే చేయాలని సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని జేవీఆర్ ఓసీ కోల్ రిసీవింగ్ సెంటర్, కన్వెన్షనల్ బంకర్లు, జీకేఆర్ వ్యూ పాయింట్, సైలో బంకర్‌ను జీఎంలు ఎస్.సుధాకర్, హబీబ్ హుస్సేన్, నారాయణరావు, స్వామినాయుడుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా బొగ్గు దుమ్ము లేవకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని ఆదేశించారు. ఏజీఎం సూర్యనారాయణ, పీఓ ఎస్.వెంకటాచారి, ఏజీఎం రఘురామిరెడ్డి, బి.శ్రీనివాస్, లక్ష్మణమూర్తి, సోమశేఖర్‌రావు, పి.నర్సింహారావు, మధుసూదన్, రమణారెడ్డి పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం

ఖమ్మం అర్బన్: ఖమ్మం విద్యానగర్ కాలనీకి చెందిన మంద లక్ష్మయ్య(60) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా బ్రెయిన్ డెడ్ అయింది. జీవన్‌దాన్ ఫౌండేషన్ సభ్యుల వినతితో కుటుంబ సభ్యులు లక్ష్మయ్యను హైదరాబాద్ తీసుకెళ్లి అవయవదానం చేశారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని మంగళవారం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అవయవదానానికి అంగీకరించిన లక్ష్మయ్య భార్య చిట్టెమ్మ, కుమారుడు హరీష్, కుమార్తె హరితకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



లక్ష్మయ్య (ఫైల్)

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటుచేయగా, మంగళవారం ఉదయం పరీక్షకు 285మందిలో 275మంది, మధ్యాహ్నం పరీక్షకు 339మందిలో 328మంది హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు.

డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన బోధన

భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

అశ్వాపురం: భద్రాచలం నుంచి అశ్వాపురం మండలంలోని మిట్టగూడెం గ్రామానికి తరలించిన గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించడమే కాక మెరుగైన బోధన అందించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి గౌతమ్ పొట్రు ఆదేశించారు. మిట్టగూడెంలోని గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను పీఓ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతి గదులు, డార్మెటరీ, వంటశాలను పరిశీలించిన ఆయన ప్రిన్సిపాల్, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా సౌకర్యాలు కల్పించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. కళాశాల ఎదురుగా ఉన్న పాఠశాల మరమ్మతుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఆతర్వాత విద్యార్థులతో మాట్లాడిన ఆయన శ్రద్ధగా చదువుకుంటూ పోటీ పరీక్షల్లో రాణించాలని తెలిపారు.

కార్పొరేట్‌కు కళాశాలలకు దీటుగా...


మణుగూరుటౌన్: కార్పొరేట్ కళాశాలలకు దీటుగా గిరిజన విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నిష్ణాతులైన అధ్యాపకులతో కళాశాలల్లో బోధన చేయిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. మణుగూరు మండలం గుట్టమల్లారం సమీపాన ఉన్న టీటీడబ్ల్యూఆర్‌జేసీ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇక్కడ రూ.2.70కోట్లతో 16తరగతి గదులు నిర్మించనుండగా అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ప్రిన్సిపాళ్లు స్వప్నకుమారి, పద్మావతి, ఆర్ఐ శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వర్లు, సర్వేయర్ తిరుపతయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



అశ్వాపురం : విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ గౌతమ్

పురోహిత క్రికెట్ టోర్నీలో ఖమ్మం విజయం

ఖమ్మంగాంధీచౌక్: ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి పురోహిత క్రికెట్ టోర్నీని ఖమ్మం స్తంభాద్రి జట్టు కైవసం చేసుకుంది. ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన టోర్నీలో 12 జట్లు పాల్గొనగా.. ఫైనల్స్‌లో కాకినాడ జట్టుతో తలపడిన స్తంభాద్రి జట్టు విజయం సాధించింది. ఖమ్మం జట్టు కెప్టెన్‌గా అవధానుల సాయినాథ్‌శర్మ వ్యవహరించారు. జట్టులోని కనిష్క మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ సిరీస్, నరేష్ ఉత్తమ బౌలర్‌గా నిలిచారు. ఈసందర్భంగా క్రీడాకారులను స్తంభాద్రి పురోహిత సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్‌శర్మ, కృష్ణశర్మతో పాటు సరస్వతిభట్ల శ్రీధర్‌శర్మ, సీతారామశాస్త్రి, జగన్నాథ్‌శర్మ, ఆమంచి సురేష్‌శర్మ తదితరులు అభినందించారు.



ట్రోఫీతో ఖమ్మం స్తంభాద్రి పురోహిత జట్టు

పెద్దాస్పత్రిలో సంబురాలు

ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ నుండి అనుమతి వచ్చిన నేపథ్యాన మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సంబురాలు నిర్వహించారు. ఈ ఏడాది నుంచే 100సీట్లు భర్తీ చేసేందుకు అనుమతి జారీ చేశారు. దీంతో ఆస్పత్రి అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లుతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వీట్ తినిపించుకున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

– ఖమ్మం వైద్యవిభాగం